క్లుప్తంగా

విద్యా కమిషన్ చైర్మన్‌ను కలిసిన 'మద్దెల'



మురళిని సన్మానిస్తున్న శివకుమార్

కొత్తగూడెంరూరల్: తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, ఐఏఎస్ ఆకునూరి మురళీని హైదరబాద్‌లో సోమవారం కొత్తగూడేనికి చెందిన అంబేద్కర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు మద్దెల శివకుమార్, ఆదర్శ ఫౌండేషన్ చైర్మన్ కుసుమ బోగరాజు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చెక్కులు అందజేత

టేకులపల్లి: బాధితులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని అనారోగ్యంతో బాధపడేవారు ఎవ్వరూ అధైర్యపడొద్దని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం టేకులపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని 68 మంది లబ్ధిదారులకు రూ.17.44 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

ఖుర్షీద్‌కు అభినందన

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రస్థాయిలో జిల్లా నుంచి ఉత్తమ అధ్యాపకుడిగా ఉన్నత విద్యా మండలి ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం చేతుల మీదుగా ఇటీవల ఎండీ.ఖుర్షీద్ అవార్డు అందుకున్నారు. మణుగూరు జూనియర్ కళాశాల సివిక్స్ లెక్చరర్ అయిన ఖుర్షీద్ అహ్మద్‌ను సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హెచ్.వెంకటేశ్వరరావు అభినందించారు. ఖుర్షీద్ కొత్తగూడెంలోని ఇంటర్మీడియట్ నోడల్ అధికారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అభినందించారు.

ఉపాధ్యాయులు సమసమాజ నిర్మాతలు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: ఉపాధ్యాయులు సమసమాజ నిర్మాతలని వివేకవర్ధిని విద్యా సంస్థల చైర్మన్ ఎంవీ చౌదరి అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సోమవారం సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చౌదరి మాట్లాడారు. అనంతరం కొత్తగూడెం మండలంలోని 19 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, 9 కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న 30 మంది టీచర్లను ఘనంగా సన్మానించారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

జూలూరుపాడు: కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉద్యోగులను సోమవారం ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఇటీవల బదిలీ అయిన పీఈటీ లక్ష్మయ్య, జూనియర్ అసిస్టెంట్లు ప్రసన్న, పాఠశాలకు హెచ్ఎం పి.సంజీవరావు, ఉపాధ్యాయులు శాలువాలు కప్పి సన్మానించి, మెమెంటోలను అందజేశారు. అదేవిధంగా బదిలీ ఉద్యోగుల స్థానంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారికి స్వాగతం పలికారు.

శాంక్షన్ పోస్టులు మంజూరు చేయండి

పాల్వంచ: కేటీపీఎస్ 5,6 దశల్లో శాంక్షన్ పోస్టులు మంజూరు చేసి ఓఅండ్ఎం కార్మికులకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(1104) యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సీఈ ఎం.ప్రభాకర్‌రావును కలిసి వినతిపత్రం అందించారు. రీజనల్ సెక్రటరీ పి.రవీందర్‌రెడ్డి, రాజేందర్, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వైతాళికుడు కాళోజీ

తెలంగాణ వైతాళికుడు కాళోజీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని సోమవారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం, తెలుగు భాష ఔన్నత్యానికి కాళోజీ చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమ కారునిగా జాతికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



కొత్తగూడెంఅర్బన్: జిల్లా గ్రంథాలయంలో..



కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో..



ఇల్లెందు: ప్రభుత్వ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు, అధ్యాపకులు



సుజాతనగర్: మండల పరిషత్ కార్యాలయంలో..



జూలూరుపాడు: కాకర్ల హైస్కూల్‌లో..



సింగరేణి(కొత్తగూడెం): రామవరం పాఠశాలలో..

సెక్యూరిటీ సిబ్బంది చట్టాలు తెలుసుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది విధి నిర్వహణలో కంపెనీ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని జీఎం సెక్యూరిటీ కోడూరి శ్రీనివాస్‌రావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ఎస్అండ్‌పీసీ ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం 46వ బ్యాచ్ సెక్యూరిటి సిబ్బందికి ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. సెక్యూరిటీ విభాగం అంటే ఆర్మీ మరియు పోలీసు విభాగాల లాగా మంచి యూనీఫాం విభాగమని, సెక్యూరిటీ సిబ్బంది డ్రిల్ పూర్తిచేయటం వలన సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను విధి నిర్వహణలో ఉపయోగించి సంస్థ ఆస్తులను కాపాడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, కే.సత్యనారాయణ, ట్రైనింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

టేకులపల్లి: గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార అన్నారు. ఈ మేరకు సోమవారం బొమ్మనపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ యశోదమ్మ ఆధ్వర్యంలో మండలంలోని చుక్కాలబోడు అంగన్‌వాడీ కేంద్రంలో, బోడు సెక్టార్ సూపర్‌వైజర్ ఖలీదా ఆధ్వర్యంలో మొక్కంపాడు1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మొక్కంపాడులో ప్రీస్కూల్ మెటీరియల్‌ని అందజేశారు. ఈ కార్యక్రమాలకు హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ.. పోషకాహారం, తల్లీబిడ్డల ఆరోగ్యం, ముర్రుపాల విశిష్టత, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లీబిడ్డలకు పోషకాహారం లభిస్తుందని, అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సల్కీ బాయి, అరుణకుమారి, సరిత, ఆశ, శారద, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీఓ తార

సింగరేణికి బకాయిలు చెల్లించండి..



మాట్లాడుతున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థకు విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన రూ.33 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, సింగరేణి సంస్థ లాభాలు ప్రకటించి కార్మికుల లాభాల వాటాను వెంటనే చెల్లించాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మికుల జాగరణలో భాగంగా కొత్తగూడెం ఏరియా పీవీకే- 5 ఇంక్లైన్ గని ఆవరణలో ఏర్పాటు చేసిన పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రూ.25 కోట్లు బాకీ ఉంటే ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత 8 నెలల్లో రూ. 8 వేల కోట్ల బకాయిలను పెంచిందని, వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా 2023–24 ఆర్థిక సంవత్సర లాభాలు ప్రకటించి కార్మికులకు వాటా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఊట్ల గణేష్, మొగిలిపాక రవి, సంఘం చందర్, గంధం సతీష్, నాగేశ్వర రావు, అల్లి ప్రకాశ్, ఇనుపనూరి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు అప్పగించొద్దు

కొత్తగూడెంఅర్బన్: పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థకు అప్పగించవద్దని కోరుతూ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈఓ జుంకీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులు నల్లబ్యాడ్జిలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ... ప్రభుత్వ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కార్మికులకు రూ.10 వేల వేతనం అందించాలన్నారు. దీంతో పాటుగా పెండింగ్ బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మధ్యాహ్న భోజన జిల్లా కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి, మండల కమిటీల సభ్యులు స్వప్న, అరుణ, రమణ, శ్రీలత, కవిత, దేవి, మాడిశెట్టి పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఆహ్వానం

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీల పోస్టుల కోసం బుధవారం వరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సబ్జెక్టుల వారిగా ఇంగ్లిష్, తెలుగు, హిందీ, హిస్టరీ, ఎకనామిక్స్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, కంప్యూటర్లకు ఒక్కొక్కటి, కామర్స్ 2 మొత్తం 11 పోస్టు ఖాళీగా ఉన్నాయని, ఈనెల 12వ తేదీ గురువారం కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

ముఖ్యమంత్రికి లేఖ

టేకులపల్లి: ఏజెన్సీ ప్రాంతమైన బోడును మండలంగా ప్రకటించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు సోమవారం మాట్లాడుతూ... బోడు మండల ఏర్పాటుతో పలు ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తుల సంతకాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ పంపించామని తెలిపారు.

ఉద్యమ కారుడు మృతి

పాల్వంచ: తెలంగాణ ఉద్యమ కారుడు ముద్దంగుల శ్రీనివాస్ (52) మృతి చెందారు. సోమవారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని కేసీఆర్ నగర్‌లోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. పలువురు పట్టణ ప్రముఖులు, ఉద్యమకారులు శ్రీనివాస్‌కు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.

సింగభూపాలెం చెరువు సందర్శన



చెరువు కట్టను పరిశీలిస్తున్న నాయకులు

సుజాతనగర్: ఏఐకేఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో సింగభూపాలెం చెరువు కట్ట కుంగిన ప్రదేశాన్ని సోమవారం సందర్శించారు. నాయకులు మాట్లాడుతూ.. అధిక వర్షాల కారణంగా చెరువు కట్ట కుంగిందని, కట్టపై మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాళ్లూరి పాపారావు, భూక్యా దస్రు, జక్కుల రాములు, కొమారి హనుమంతరావు, బొడ్డు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు



సుజాతనగర్: పోలీస్‌స్టేషన్‌లో పూజలు నిర్వహిస్తున్న డీఎస్పీ, ఎస్సై

సుజాతనగర్: పండుగలు సంప్రదాయానికి ప్రతీకలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఎస్సై జుబేదాబేగంతో కలిసి సోమవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల వద్ద స్థాపిర భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పాల్వంచ: పూజలు చేస్తున్న భక్తులు

మంచు శివలింగాలతో పూజలు..

పాల్వంచ: శాస్త్రీ రోడ్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణే ష్ మండపంలో సోమవారం పూజలు నిర్వహించారు. మంచుతో తయారు చేసి 21 లింగాకారాలను ఏర్పాటు చేశారు. 116 మంది మహిళలచే 21 సార్లు బిల్వాష్టకం, శివాష్టకం చేయించారు. చలవాది ప్రకాష్, వేద పండింతులు నాని శర్మ, బచ్చు శ్రీనివాస్, గూడెపు శ్రీనివాస్, మౌనిక, కుటుంబరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఇల్లెందురూరల్: స్థానిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా మండలంలోని పలు గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ ధన్‌సింగ్ సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలను తనిఖీ చేశారు. గాలి, వెలుతురు, వసతి తదితర సదుపాయాలను పరిశీలించి మరింత మెరుగుదల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యదర్శులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే ఫొటో ఓటరు జాబితాను పంచాయతీలు, వార్డుల వారీగా విభజించి సిద్ధం చేశామన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ చేస్తున్నట్లు చెప్పారు. 29 గ్రామపంచాయతీల పరిధిలో ఓటర్ల సంఖ్యకు సరిపడా పోలింగ్ కేంద్రాలను సౌకర్యాలతో సిద్ధంగా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు రాజు, రాధిక తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

వరద బాధితులకు అండగా నిలుస్తాం..



వరద బాధితులకు దుస్తులను అందజేస్తున్న సాబీర్‌పాషా

పాల్వంచరూరల్: భారీవర్షాలు, వరదతో సర్వస్వం కోల్పోయిన పేదలకు తమ పార్టీ అండగా నిలుస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషా అన్నారు. మండలంలోని కిన్నెరసాని, ఉల్వనూరు గ్రామాల ప్రజలకు సోమవారం ఆయన రూ.2లక్షల విలువైన నిత్యావసర సామగ్రి, దుస్తులు అందజేసి మాట్లాడారు. బాధితులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని కోరారు. నాయకులు ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, ఉప్పుశెట్టి రాహుల్, వి.పద్మజ, ముత్యాల కిరణ్‌కుమార్, శ్రీనివాసరావు, నరహరి, వెంకన్న, కొంగర అప్పారావు, శ్రీను, గిరి, రాజశేఖర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

మావో చూపిన బాటతోనే విముక్తి

సింగరేణి(కొత్తగూడెం): మావో చూపిన బాటతోనే విముక్తి లభిస్తుందని, వెనకబడిన దేశాలన్నింటికీ మార్క్సిజమే శరణ్యమని సీపీఐ ఎంఎల్(న్యూడెమెక్రసీ) నాయకుడు సీతారామయ్య పేర్కొన్నారు. కొత్తగూడెంలోని ఇఫ్టూ కార్యాలయంలో సోమవారం మావో 48వ వర్ధంతి నిర్వహించగా ఆయన మాట్లాడారు. చైనా వ్యవసాయంపై ఆధారపడిన దేశమే అయినా కమ్యూనిస్టుల ఆధ్వర్యాన అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. భూక్యా హరిజా, ఎండీ.అలీమొద్దీన్, లక్ష్మణ్, ఈరియా, రమేష్, శంకర్, రఘు, దినేష్ పాల్గొన్నారు.

ఇల్లెందు: దేశంలోని అన్ని సమస్యలకు మావో చూపిన మార్గమే శరణ్యమని మాస్‌లైన్ రాష్ట్ర నాయకురాలు చంద్ర అరుణ, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, ఎన్డీ సాదినేని వర్గం నేత జే.సీతారామయ్య, ఎన్డీ చంద్రన్న వర్గం జిల్లా కార్యదర్శి బానోతు ఊక్లా అన్నారు. సోమవారం ఇల్లెందులో మాస్‌లైన్, ఎన్డీ మూడు వర్గాలు తమ తమ కార్యాలయాల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన మావో 48వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాంసింగ్, సాంబ, గణేష్, బోసు, యాకుబ్‌షావలీ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, విప్లవ యోధుడు మావో 48వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం టేకులపల్లిలో ఘనంగా నివాళులర్పించారు. పీడిత ప్రజల రాజ్యస్థాపనే ధ్యేయంగా మావో చేసిన పోరాటాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భూక్యా హర్ష్య, నోముల భానుచందర్, వీర్య తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న సీతారామయ్య

సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలి

ఇల్లెందు: ఇల్లెందు నెహ్రూనగర్ శాఖ 5వ శాఖ మహాసభ సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు సీపీఎం కార్యకర్తలు అలుపెరుగని పోరాటం చేయాలని రాష్ట్ర నాయకులు ఏజే రమేష్ పిలుపునిచ్చారు. కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు మరిచారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నబీ, తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, కిరణ్‌కుమార్, సుల్తానా, కాంత, మమత, సత్యనారాయణ, ఆడెపు కృష్ణ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు అతలాకుతలం..

- పంటలకు తీవ్ర నష్టం
- రహదారులు ధ్వంసం

జూలూరుపాడు: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పది రోజులుగా కురుస్తున్న భారీ, అతి భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండగా, చెరువులు, కుంటలు నిండి జలకళతో కళకళలాడుతున్నాయి. చెరువులు, కుంటలు మత్తడి పోస్తున్నాయి. భారీ వర్షాలకు జనం అతలాకుతలం అవుతున్నారు. అదేవిధంగా పంటలకు తీవ్రనష్టం కలగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి, వరి, మిరప, కూరగాయ పంటలు నీటమునిగాయి. పత్తి పూత, పిందె దశలో ఉన్న సమయంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పూత, పిందె రాలుతుండగా, ఈదురు గాలులకు చెట్లు నేలకొరుగుతుండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలతో వరి పంట నీటమునగగా, మిరప తోటల్లో ఇసుక మేటలు పెట్టడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షాలకు అంతర్గత రోడ్లు, రహదారులు జలమయం అవుతున్నాయి. పలు గ్రామాల్లోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. వరద ప్రవాహానికి భేతాళపాడు-చింతలతండా గ్రామాల మధ్య బీటీ రహదారి కోతకు గురయింది. కొమ్ముగూడెం-కరివారిగూడెం, జూలూరుపాడు-పాపకొల్లు, పాపకొల్లు-అన్నారుపాడు గ్రామాల మధ్యన బీటీ రోడ్లు ధ్వంసం కావడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రహదారులు, అంతర్గత రోడ్లు దెబ్బతినడంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామాల్లో అధికారులు ఒకవైపు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నప్పటికీ మరోవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు మళ్లీ ఎప్పటిలాగే ఉంటోంది. ప్రజారోగ్యం దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పారిశుద్ధ్య పనులను కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతుల అవస్థలు... భోజ్యాతండా గ్రామ పంచాయతీ పరిధి రాజారావుపేట గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లే దారి అస్తవ్యస్తంగా మారడంతో రైతులు, కూలీలు ఇబ్బంది పడుతున్నారు. పొలాలకు వెళ్లే దారిలో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో రైతులు ప్రమాదం బారినపడే పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలం వచ్చిందంటే బురదలో నడవలేకపోతున్నారు. రాజారావుపేట, వెనకతండా, పాపకొల్లు, భీమ్లాతండా తదితర గ్రామాల రైతులు ఈ దారిలో పంట పొలాలకు వెళ్లాల్సి ఉంది. పంట పొలాలకు ఎరువులను తీసుకెళ్లాలంటే ఎంతో కష్టంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మంజూరు చేసి, తమ కష్టాలను తీర్చాలని రైతులు కోరుతున్నారు. ఈ దారిని సోమవారం పంచాయతీ సెక్రటరీ వెంకట్, గిరిజన సంఘం నాయకుడు ధరావత్ కాన్సీరామ్‌లు పరిశీలించారు.



కొమ్ముగూడెంలో మిరప తోటలో ఇసుక మేట వేసిన దృశ్యం



రాజారావుపేట గ్రామ సమీపంలో వాగును పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి వెంకట్

సేవాలాల్ సేన జెండా ఆవిష్కరణ

పాల్వంచ: గిరిజనులు ఏక తాటిపైకి వచ్చి హక్కులు, చట్టాలను కాపాడుకోవాలని సేవాలాల్ మహారాజ్ జిల్లా యువసేన అధ్యక్షుడు భరత్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక సంక్షేమ భవన్‌లో సేవాలాల్ సేన 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను భరత్ నాయక్ ఆవిష్కరించారు. పరమేష్ నాయక్, చంద్ర నాయక్, రాజు నాయక్, వంశీ నాయక్, విజయ్, దేవ్‌సింగ్, ప్రసాద్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లిలో సోమవారం జరిగిన సేవాలాల్ సేన 10వ ఆవిర్భావ దినోత్సవంలో బోడ భాస్కర్, భిక్షం నాయక్, కబీర్ నాయక్, సురేష్, తోగ్గూడెం గ్రామంలో బి.శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: కలెక్టరేట్ సమీపంలో సేవాలాల్ సేన 10వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ కార్యవర్గ అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, సేవాలాల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్ చంద్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు అంగోత్ రాంబాబునాయక్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో పెద్ద ఎత్తున సేవాలాల్ సేన సైనికులు ఉన్నారన్నారు. పూర్తి ఏజెన్సీ జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రవిరాథోడ్, శ్రీనునాయక్, బాదావత్ శ్రీనివాస్ ధరావత్ సురేష్‌నాయక్, వెంకటేష్‌నాయక్, బోడ రమేష్‌నాయక్, బానోతు నాగరాజు నాయక్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారమే లక్ష్యమే సేవాలాల్ సేన లక్ష్యమని సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఆంగోత్ ఆంజనేయులు, యువజన విభాగం మండల శాఖ అధ్యక్షుడు సురేష్‌నాయక్ అన్నారు. సేవాలాల్ సేన 10వ ఆవిర్భవ దినోత్సవాన్ని పురస్కరించుకొని చల్లసముద్రంలో సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. మాట్లాడుతూ.. సేవాలాల్ సేన వ్యవస్థాపకుడు సంజీవ్ నాయక్ దశాబ్దకాలంలో జాతి కోసం అనేక పోరాటాలు చేసి సఫలీకృతుడయ్యారని, జాతి ప్రజలు హక్కులను, అవకాశాలను అందిపుచ్చుకునేలా కృషి చేశాడని గుర్తుచేశారు. జాతిని ఏకతాటిపైకి తెచ్చి హక్కులు, చట్టాలు కాపాడుతామని, గిరిజన మహిళలకు రక్షణ కల్పించడంలో సంఘం ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. నాయకులు అశోక్, రమేష్, రవీందర్, వంశీ, చరణ్, రాకేష్, వీరు, హీరాలాల్, శివ, విజయ్, బిచ్చు, లాల్ నాయక్, తులసియా, ఆనంద్ పాల్గొన్నారు.



పాల్వంచ: జెండా ఆవిష్కరణలో పాల్గొన్న గిరిజన సంఘాల నాయకులు